# సాక్షి
## మంచిర్యాల
శనివారం । 28 । జనవరి । 2023






**'ఆదర్శ'ం పిలుస్తోంది..**
ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ప్రకటన వెలువడింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తున్నాయి. 8లో▸



**జనసంద్రంగా నాగోబా** 10లో▸
ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం జనసంద్రంగా మారింది. నాగోబా దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
32.0 /17.0
ఆకాశం ప్రకాశంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### బియ్యం పంపిణీలో అవకతవకలకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** పేదలకు రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు తావివ్వొద్దని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్‌తో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్, ఎంఎల్‌ఎస్ పాయింట్ నిర్వాహకులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, స్టేజ్-1, స్టేజ్-2 కాంట్రాక్టర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో సరుకుల నిల్వలు సక్రమంగానే ఉన్నాయని, ఇక్కడి నుంచి రేషన్ దుకాణాలకు కేటాయించిన ప్రకారం సరఫరా చేస్తారని తెలిపారు. హమాలీ చార్జీలు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అందిస్తామని, రేషన్‌డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### 30 నుంచి గూడెంలో బ్రహ్మోత్సవాలు

**దండేపల్లి:** మండలంలోని గూడెంగుట్ట రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 6 వరకు స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు తెలిపారు. 30న నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, విశ్వక్సేనారాధన, దీక్ష కంకణధారణ, నిరంతర సప్తాహ భజనలు, ఫిబ్రవరి 2న నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, వాసుదేవా పుణ్యాహవచనం, పటాధివాసం, ధ్వజారోహణం, రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 3న నిత్యవిధి ప్రాభోధిక ఆరగింపు, హవనం, 4న నవగ్రహ హోమం, పంచసూక్తహోమాలు, నిత్యహోమాలు, బలిహరణం, 5న మాఘపౌర్ణమి జాతర, స్వామివారి సేవోత్సవం, 6న రథోత్సవం, సప్తాహ భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

### స్పౌజ్ ఉపాధ్యాయులకు పోస్టింగ్

**మంచిర్యాలఅర్బన్:** స్పౌజ్ బదిలీల్లో భాగంగా కుమరంభీం జిల్లా నుంచి మంచిర్యాలకు వచ్చిన తొమ్మిది మంది ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాల(పోస్టింగ్) కేటాయించారు. ఉదయం డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేయగా కలెక్టర్ భారతిహోళ్లికేరి ఆమోదంతో పోస్టింగ్‌లు ఇచ్చారు.

### అదనపు కలెక్టర్ రాహుల్ ఆకస్మిక తనిఖీ



నర్సరీ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

**భీమారం:** మండలంలోని ఎలకేశ్వరం గ్రామాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ ద్వారా చేపడుతున్న మొక్కల నర్సరీని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కొత్త గ్రామ పంచాయతీ భవనానికి నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలని సర్పంచ్ కొడిపె సమ్మయ్యకు సూచించారు. గ్రామ సమీపంలో నర్సరీ వాగుపై ఉపాధిహామీ పథకం కింద కల్వర్టు నిర్మించాలని ఈజీఎస్ ఏపీవో ఎస్తర్‌ను ఆదేశించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఫణిందర్‌రావు, ఎంపీవో సతీష్‌రెడ్డి, ఏపీవో ఎస్తర్ డేవిడ్, కార్యదర్శి నవ్య పాల్గొన్నారు.

# ఇక బదిలీలు.. పదోన్నతులు

- జిల్లాలో ప్రక్రియ షురూ..
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- ఉపాధ్యాయుల సీనియారిటీ, ఖాళీల జాబితా ప్రదర్శన



విద్యాశాఖ కార్యాలయంలో జాబితాను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

**మంచిర్యాలఅర్బన్:** విద్యాశాఖలో ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీల ప్రక్రియ మొదలైంది. పాఠశాలల్లోని ప్రస్తుత ఖాళీల జాబితా, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హులైన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రదర్శించారు. హెచ్‌ఎం గ్రేడ్-2 కోసం 43 ఖాళీలు ఉన్నాయి. హెచ్‌ఎం గ్రేడ్-2 పదోన్నతుల కోసం 119, లోకల్‌బాడీలో 10 మంది స్కూల్ అసిస్టెంట్ల ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం 145 ఖాళీలు ఉండగా.. 810 మంది ఎస్జీటీల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. జిల్లాలో ఆయా సబ్జెక్టుల్లో 459 ఖాళీలు ప్రకటించారు. మల్టీ జోనల్ పద్ధతిలో జరిగే పీజీ హెచ్‌ఎం గ్రేడ్-2 బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీల ఆధారంగా స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించనున్నారు. అనంతరం ఎస్జీటీలకు పదోన్నతి కల్పిస్తారు. గ్రేడ్-2 హెచ్‌ఎం, ఎస్‌ఏ పదోన్నతుల తర్వాత మరిన్ని ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. బదిలీల్లో పండిట్‌లు, పీఈటీలకు అవకాశం ఉన్నా పదోన్నతుల విషయంలో సందిగ్ధత నెలకొంది. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పదోన్నతులు, బదిలీలకు ఈ నెల 28నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. అర్హులైన ఉపాధ్యాయులు 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు ప్రతిని పూర్తి ఆధారాలతో అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాలు ఎట్టి పరిస్థితుల్లో మార్పుకు అవకాశం లేదు. తగిన జాగ్రత్తలతో ఆన్‌లైన్ ద్వారా బదిలీ దరఖాస్తు చేసుకోవాలి, మార్గదర్శకాలను డీఈవో వెంకటేశ్వర్లు వెల్లడించారు.

### మార్గదర్శకాలు ఇవిగో...

- ప్రభుత్వ, లోకల్ బాడీలో పని చేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 1-2-2023వరకు ఒకే పాఠశాలలో ప్రస్తుత కేటగిరీలో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసినట్లయితే బదిలీలకు అర్హులుగా ప్రకటించారు.
- ప్రభుత్వ, లోకల్ బాడీలో పని చేసే ప్రధానోపాధ్యాయులు 1-2-23వరకు ఒకే పాఠశాలలో ప్రస్తుత కేటగిరీలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసినట్లయితే తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు.
- ప్రభుత్వ, లోకల్ బాడీలో పని చేసే ఉపాధ్యాయులు 1-2-23వరకు ఒకే పాఠశాలలో ప్రస్తుత కేటగిరీలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. 1-2-23 నుంచి పదవీ విరమణ గడువు మూడేళ్లలోపు ఉన్నట్లయితే బదిలీ ప్రక్రియ ఆ ఉపాధ్యాయుల ఇష్టానుసారమే జరుగుతుంది.
- బాలికల ఉన్నత పాఠశాలలో 1-2-23వరకు 50ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పురుష ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను బదిలీ చేయనున్నారు.
- ఒకవేళ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేయడానికి మహిళా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందుబాటులో లేని సందర్భంలో 50ఏళ్ల పైబడిన పురుష ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవకాశం కల్పిస్తారు.
- ఎన్‌సీసీ అధికారులుగా పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల్లో 5/8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నవారిని మళ్లీ ఎన్‌సీసీ యూనిట్ ఉన్న పాఠశాలలకు బదిలీ చేస్తారు.
- ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పౌస్ పాయింట్స్‌తో బదిలీలకు దరఖాస్తు చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత సర్టిఫికెట్లు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు జత చేసి సంబంధిత అధికారికి అందజేయాలి.
- పూర్తి బదిలీలు, పదోన్నతులు 2023 ప్రభుత్వ ఉత్తర్వులు జీవో నంబర్-5 అనుగుణంగా జరుగుతాయి.

### బదిలీల తర్వాతే..

ఖాళీలు, తాత్కాలిక హక్కుకు వ్యతిరేకంగా(ఎగెనెస్ట్ పోస్టు) పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధిత సబ్జెక్టుల్లో జిల్లాలో ఖాళీలు లేకుంటే ఆ పోస్టులు ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్-2023 కోసం ప్రదర్శించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్-2023 పూర్తయిన తర్వాత అందుబాటులో ఉన్న ఖాళీలకు అనుగుణంగా వీరిని సర్దుబాటు చేయనున్నారు. ఉదాహరణకు జిల్లాలో గణితం పోస్టుల్లో ఫిజికల్ సైన్స్ టీచర్ విధులు నిర్వహిస్తున్నారు. టీచర్ల ఖాళీలపై స్పష్టత వచ్చేనా అనే శీర్షికతో 'సాక్షి'లో ఈ నెల 26న 'ఆ పోస్టుల సంగతేమిటో..' అంటూ జిల్లాలో గణితం, సోషల్ పోస్టుల్లో ఫిజికల్ సైన్స్ టీచర్లు విధులు నిర్వర్తిస్తున్న తీరుపై కథనం ప్రచురితమైంది. దాదాపు 15 వరకు గణితం ఖాళీలున్నాయి. ఈ సబ్జెక్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న ఫిజికల్ సైన్స్ టీచర్లను బదిలీల అనంతరం ఖాళీలను బట్టి సర్దుబాటు చేయనున్నారు. ఇదంతా జిల్లా విద్యాశాఖ అధికారి పరిధిలోనే చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పొందుపర్చారు.

# ప్రజల భద్రతనే ప్రధాన లక్ష్యం

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- పోలీసు కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

**మంచిర్యాలక్రైం:** పోలీసు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ భద్రతనే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమారాజేశ్వరి అన్నారు. నల్గొండ ఎస్పీగా పని చేస్తూ ఇటీవల బదిలీ కాగా రామగుండం పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. న్యాయానికి, ధర్మానికి లోబడి చట్టబద్ధంగా సామాన్య ప్రజలకు తనతోపాటు పోలీసు అధికారులు సేవలందించేలా కృషి చేస్తానని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా సహించేది లేదని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాన్య ప్రజలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వారికి భరోసా కలిగించే విధంగా పని చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా, అక్రమ దందాలు, అక్రమ రవాణపై దృష్టి సారించి ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి ఇక్కడి పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో బెల్లంపెల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, జైపూర్ ఏసీపీ నరేందర్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల సీఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

# 'స్థానిక' ఉప పోరు ఎప్పుడో..!

- జిల్లాలో 115 గ్రామ పంచాయతీల్లో ఖాళీలు
- తొమ్మిది సర్పంచ్, 367 వార్డు సభ్యుల స్థానాలు
- ఏడాది క్రితమే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- 388 పోలింగ్ కేంద్రాల్లో తుది ఓటరు జాబితా ప్రదర్శన



సర్పంచ్ స్థానం ఖాళీ ఉన్న ధర్మారావుపేట

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో వివిధ కారణాలతో ఏర్పడిన ఖాళీల్లో ఉప ఎన్నిక నిర్వహణలో జాప్యం జరుగుతోంది. సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఇన్‌చార్జీల పాలన సాగుతోంది. స్థానిక సంస్థల్లో పదవులకు రాజీనామా చేయడం, కొన్ని చోట్ల ప్రజాప్రతినిధులు మరణించడం వల్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ఆయా స్థానాల్లో గత ఏడాదే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా వాయిదా పడుతూ వస్తున్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉప ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతుండడంతో బరిలో నిలవాలి అనుకున్న అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారు. జిల్లాలోని 16 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 115 గ్రామ పంచాయతీల్లోని తొమ్మిది సర్పంచ్, 367 వార్డు సభ్యుల, రెండు ఎంపీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. 2019 జనవరి 30న సర్పంచ్ ఎన్నికలు జరుగగా అదే రోజు ఫలితాలు వెలువడ్డాయి. ఫిబ్రవరి 2న సర్పంచులు బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో కొందరు వివిధ కారణాలతో రాజీనామా చేయగా, మరికొందరు మరణించారు.

**ఖాళీ స్థానాలు ఇవే..**
జిల్లాలోని తొమ్మిది పంచాయతీల్లో ఖాళీగా ఉన్న సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. జిల్లాలోని దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్, గూడెం, వందూరుగూడ, కోటపల్లి మండలం కొల్లూరు, సిర్సా, తాండూరు మండలం తాండూరు, కన్నెపల్లి మండలం సాలిగావ్, కాసిపేట మండలం ధర్మారావుపేట, వేమనపల్లి మండలం రాజారం గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ ఎన్నికలు జరగాల్సిన గ్రామాల్లో అధికారులు 388 పోలింగ్ కేంద్రాలు గుర్తించారు. 51,790 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్లు 26,073, పురుష ఓటర్లు 25715 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు.

**కుంటుపడుతున్న అభివృద్ధి**
సర్పంచ్‌లు లేని గ్రామాల్లో ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు చెక్ పవర్ ఇచ్చారు. ఖాళీలు, ఇన్‌చార్జీల పాలన సాగుతుండడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. స్థానిక సంస్థల ఉప పోరులో పోటీకి బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతోపాటో స్వతంత్రులు సిద్ధంగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో స్థానిక సంస్థల ఉప ఎన్నికలు నిర్వహిస్తే పోటీ రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయి. సర్పంచ్‌ల పదవీ కాలం మరో ఏడాది మిగిలి ఉండడంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారుతాయనడంలో సందేహం లేదు.

**ఉప ఎన్నిక జరగాల్సిన స్థానాలు**

| | |
|---|---|
| సర్పంచ్ | 9 |
| వార్డు సభ్యులు | 367 |
| ఎంపీటీసీ | 2 |
| పోలింగ్ కేంద్రాలు | 388 |
| మొత్తం ఓటర్లు | 51,790 |

**నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం..**



జిల్లాలో స్థానిక సంస్థల్లో జరగాల్సిన ఉప ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితా పంచాయతీల్లో ప్రదర్శించాం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. తుది ఓటరు జాబితాను ప్రభుత్వానికి కూడా నివేదించాం.
– ఫణీందర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

# సమీకృత మార్కెట్ల నిర్మాణం పూర్తి చేయాలి

- కలెక్టర్ భారతిహోళ్లికేరి
- మున్సిపల్ కమిషనర్లు, అధికారుల సమావేశం



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ భారతిహోళ్లికేరి

**పాతమంచిర్యాల:** ప్రజల సౌకర్యార్థం పురపాలక సంఘాల్లో చేపట్టిన సమీకృత కూరగాయల, మాంసపు మార్కెట్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లాలోని మున్సిపాల్టీల కమిషనర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.7.20కోట్లతో ఏడు మున్సిపాల్టీల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్, చెన్నూర్, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లో మార్కెట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కూరగాయల నిల్వకు కోల్డ్‌స్టోరేజీ పాయింట్ ఏర్పాటు చేస్తామని అన్నారు. మున్సిపాల్టీల్లో వైకుంఠధామాల ఏర్పాటుకు స్థలాలు గుర్తించి పనులు ప్రారంభించామని వివరించారు. మంచిర్యాలలో రూ.2కోట్లు, మందమర్రిలో రూ.2.25కోట్లు, మిగతా ప్రాంతాల్లో రూ.కోటి వ్యయంతో పనులు చేపడుతామని చెప్పారు. మంచిర్యాల రాజీవ్‌నగర్, లక్సెట్టిపేట, చెన్నూర్ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రజారోగ్యశాఖ ఈఈలు, డీఈలు, ఏఈఈలు, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

**ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలి**
**జైపూర్:** కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజలంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. జైపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. కంటి పరీక్షలు చేయించుకున్న గ్రామస్తులతో మాట్లాడారు. రిజిష్టర్లు, మందులు, కళ్లద్దాలు, నిల్వ రిజిష్టర్లు పరిశీలించారు. తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, వైద్యాధికారి అనిల్‌రావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి



బెల్లంపల్లి చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్
- బెల్లంపల్లి చౌరస్తాలో నాయకుల నిరసన

**పాతమంచిర్యాల:** విద్యుత్ బిల్లుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని, చార్జీల పేరిట పేదలను దోపిడీ చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బెల్లంపల్లి చౌరస్తాలో బీజేపీ నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరసన తెలిపే హక్కు లేకుండా పోయిందని, బీజేపీ నాయకులను అరెస్టు చేయడం నిరంకుశ పాలనకు నిదర్శమని అన్నారు. గతంలో విద్యుత్ శాఖ డెవలప్‌మెంటు చార్జీల పేరుతో వేల రూపాయల బిల్లులు వసూలు చేసి ఈ దఫా ఏసీడీ చార్జీల పేరుతో పేదల సొమ్ము దోపిడీ చేస్తోందని విమర్శించారు. ఏసీడీ చార్జీల వసూలు ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, రజనీష్‌జైన్, పట్టి వెంకటకృష్ణ, జోగుల శ్రీదేవి, ముదాం మల్లేష్, లక్ష్మీనారాయణ, రాజబాబు, బల్ల రమేష్, పల్లి రాకేష్, రెడ్డిమల్ల అశోక్, రాకేష్‌రేణ్వా, నాగుల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది లేరు.. అంబులెన్స్ రాదు..!

- పీహెచ్‌సీలో గర్భిణి ప్రసవ వేదన
- ప్రైవేటు వాహనంలో చెన్నూర్‌కు తరలింపు



పీహెచ్‌సీలో పురిటినొప్పులతో సునీత

**వేమనపల్లి:** మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పేరుకే 24గంటల ఆస్పత్రిగా మారింది. సిబ్బంది ఉండకపోవడం, సమయపాలన పాటించకపోవడం, ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వైద్యం కోసం రోగులు వెళ్తే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శుక్రవారం పురిటినొప్పులు పడుతున్న గర్భిణికి అదే పరిస్థితి ఎదురైంది. మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన నిండు గర్భిణి ఎల్లెల సునీతకు సాయంత్రం ఆరు గంటలకు నొప్పులు రావడంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి ఆస్పత్రిలో లేరు. స్టాఫ్‌నర్సు పోస్టు భర్తీ చేయలేదు. ఇతర సిబ్బంది లేరు. కాంటింజెంట్ వర్కర్ బాపు మాత్రమే విధుల్లో ఉన్నాడు. చేసేదేమీ లేక సునీత, కుటుంబ సభ్యులు రెండు గంటలు వేచి చూశారు. 30కిలోమీటర్ల దూరంలోని చెన్నూర్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. పీహెచ్‌సీ అంబులెన్స్(అవ్వల్ కమిటీ) ఉన్నా మూడు నెలల క్రితమే మండలం నుంచి తరలించారు. 108కు సమాచారం అందిస్తే మరమ్మతుల కారనంగా రాలేమనే సమాధానం వచ్చింది. జిల్లా కేంద్రం నుంచి రావడానికి రెండు గంటల సమయం పడుతుందని సిబ్బంది తెలిపారు. సునీత పురిటినొప్పులతో విలవిలలాడుతూ చలిలో వణికిపోయింది. ఆమె భర్త అశోక్, తల్లిదండ్రులు ముత్తయ్య, రాజక్క ప్రైవేటు వాహనంలో చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు.

# ఆలయాల అభివృద్ధికి నిధులు

- పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ వెంకటేష్‌నేత

**దండేపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి భారీగా నిధులు ఖర్చు చేస్తోందని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత అన్నారు. మండలంలోని లక్ష్మీకాంతపూర్‌లో రూ.22.5లక్షల వ్యయంతో భక్తాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి శుక్రవారం భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు ప్రభుత్వం ప్రతీ నెల రూ.6వేలు చెల్లిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ అనిల్, సర్పంచ్ సత్యవతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేష్, ఆలయ కమిటీ చైర్మన్ కాంతరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**కంటి వెలుగు శిబిరం సందర్శన**
మండలంలోని చింతపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు సందర్శించారు. కంటి పరీక్షల కోసం వచ్చిన వారితో మాట్లాడారు. సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**అటెండర్ల వినతి**
**దండేపల్లి:** ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ అటెండర్లుగా పనిచేస్తున్న తమకు గుర్తింపుతోపాటు వేతనాలు పెంచాలని అటెండర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దేవేందర్ కోరారు. లక్ష్మీకాంతపూర్‌లో ఎంపీ వెంకటేష్‌నేతకు వినతిపత్రం అందజేశారు.

**రోడ్డు పనులకు భూమిపూజ**
**పాతమంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని హమాలీవాడ, గాంధీనగర్‌లో రోడ్డు పనులకు ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్‌చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ పల్లే భూమేష్, బీఆర్‌ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# నటి జమునకు ఘన నివాళి



జమునకు నివాళులర్పిస్తున్న కళాకారులు

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక స్నేహ ఫౌండేషన్ కూచిపూడి నాట్యాలయ ఆధ్వర్యంలో శుక్రవారం నట శిరోమణి జమున చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. జిల్లా సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షుడు వై.ఉమామహేశ్వర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాలలో 1971లో నాటక పోటీలకు జమున ముఖ్య అతిథిగా హాజరై బహుమతి అందజేశారని గుర్తుచేశారు. మహానటి జమున మృతి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో స్నేహ ఫౌండేషన్ చైర్మన్ కేవీ ప్రతాప్, డైరెక్టర్ చిదానందకుమారి, భాగ్యలక్ష్మీ, రాంప్రకాశ్, జ్యోత్స్న, సునిత, రోజా, తిరుపతి వర్మ, రాజ్‌ఉమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కోలిండియా వాలీబాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక

మందమర్రిరూరల్: ఈ నెల 30, వచ్చే నెల 1న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే కోలిండియా వాలీబాల్ పోటీలకు మందమర్రి ఏరియా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆర్కే–1 గనిలో ట్రామర్‌గా విధులు నిర్వహించే ఎస్.రమేష్, సివిల్ విభాగంలో విధులు నిర్వహించే వి.రాములు ఎంపిక కాగా వీరిని శనివారం నుంచి రిలీవ్ కావాల్సిందిగా జీఎం శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు.

### కాంగ్రెస్‌లో నాతరి స్వామి చేరిక


కాంగ్రెస్‌లో చేరిన స్వామి, అతడి అనుచరులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన న్యాతరి స్వామి అతడి అనుచరులతో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరాడు. ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ కె.ప్రేమ్‌సాగర్‌రావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కొద్ది రోజుల నుంచి స్వామి రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న స్వామి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఓ మాజీ ప్రజాప్రతినిధి ఆశీస్సులతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

### ఎట్టకేలకు లిఫ్టు నీళ్లువచ్చాయి!

దండేపల్లి: గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం మరమ్మతులు గురువారం సాయంత్రం పూర్తవడంతో రాత్రి 8:30 గంటలకు మోటార్లు ఆన్‌చేయగా, రాత్రి 11:15 గంటలకు సాగు నీరు తానిమడుగు వద్ద గల ఎత్తిపోతల డెలివరీ పాయింట్ నుండి కడెం ప్రధాన కాల్వలోకి చేరాయి. ఎత్తిపోతల ద్వారా ప్రస్తుత యాసంగి పంటలకు సాగు నీరందించేందుకు, గత నెల డిసెంబర్ 29న నీటిని విడుదల చేశారు. నీటి విడుదల చేసి గురువారం నాటికి 30 రోజులు గడిచాయి. అందులో పైప్‌లైన్ మూడు చోట్ల లీకవడం, రెండు సార్లు కరెంట్ సమస్యలతో మోటార్లు నవడలేదు. దీంతో నీటి సరఫరాకు 25 రోజులు అంతరాయం ఏర్పడింది. నీటిని విడుదల చేసినప్పటి నుంచి నీటి సరఫరా జరిగింది మాత్రం 5 రోజులే. ఎట్టకేలకు మరమ్మతులు పూర్తికావడంతో గురువారం రాత్రి నుంచి ఒక్క మోటారు ద్వారా సాగునీటి సరఫరా కొనసాగుతోంది. త్వరలో రెండో మోటార్ ఆన్‌చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

# 'ఆదర్శం' పిలుస్తోంది..

- మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు
- ఫిబ్రవరి 15 చివరి తేదీ
- 6వ తరగతిలో ఉమ్మడి జిల్లాలో 1400 మంది విద్యార్థులకు అవకాశం
- ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష


ఆసిఫాబాద్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు ప్రకటన వెలుబడింది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభావంతులైనా నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యకు ఈ పాఠశాలు దోహద పడనున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితం ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 2013లో ఆదర్శ పాఠశాలను నెలకొల్పింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ (యూ), మందమర్రి, మంచిర్యాల్, కుంటాల, కోటపెల్లి, కాసిపేట్, దండేపల్లి, నార్నూర్, గుడిహత్నూర్, జైనథ్, బోథ్, ఆదిలాబాద్ (బంగారుగూడ), బజార్‌హత్నూర్‌లో ఈ పాఠశాలలు ఉన్నాయి.

**సీట్ల కేటాయింపు ఇలా..**

ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలో 6వ తరగతిలో 14వందల మంది విద్యార్థుల ప్రవేశం ఉంటుంది. దీంతోపాటు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2022–23 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొంది మధ్యలో వివిధ కారణాలతో మానివేసిన ఖాళీ సీట్ల ప్రవేశం కోసం అవకాశం ఉంటుంది. ప్రవేశాలు రోస్టర్ పద్ధతిలో నిర్వహిస్తారు. 100 సీట్లలలో ఎస్సీ విద్యార్థులకు 15 శాతం, ఎస్టీ విద్యార్థులకు 6శాతం, బీసీ విద్యార్థులకు 29శాతం ఉంటాయి. ఇందులో (బీసీ ఎ–7) (బీసీ బి–10) (బీసీ సీ–1)(బీసీ డి–7)(బీసీ ఈ–4)తో పాటు ఓపెన్ కేటగిరీలో 50 సీట్లను భర్తి చేయనున్నారు. అన్నీ కేటాగిరీలోనూ బాలికలకు 33 శాతం, 3శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించనున్నారు.

### ఆన్‌లైన్ దరఖాస్తులు ఇలా..

ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వైబ్‌సైట్ వైబ్‌సైట్ http//telanganams.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి పాస్‌ఫోటో, ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బోనఫైడ్ జిరాక్స్ పత్రాలు ఏ పాఠశాల ప్రవేశం కోసం నమోదు చేసుకున్నామో ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలి.

### ప్రవేశ పరీక్ష విధానం

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్షని అబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఐదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లిష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25ప్రశ్నలు ఇస్తారు.

### మోడల్ స్కూల్ ప్రత్యేకత...

- 6 నుంచి 10వ తరగతి వరకు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా బోధన
- ఆంగ్ల మాధ్యమంలో విద్య
- పక్కా భవనంతో తరగతి గదులు

### ఫిబ్రవరి 15 తుది గడువు

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కోసం జనరల్ కేటాగిరీ విద్యార్థులకు రూ.200 ఈడబ్ల్యూఎస్ దివ్యాంగుకలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 8వ తేదీ నుంచి 12వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుంది.

### లోకల్ విద్యార్థులకు ప్రాధాన్యత



ఆదర్శ పాఠశాలో 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో 6వ తరగతిలో 100 సీట్లు మిగితా 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేస్తాం. లోకల్ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తాం.

– అబ్దుల్ ఖలీల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్

- 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వమే పుస్తకాలను అందజేస్తుంది.
- సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ సదుపాయం.
- నాణ్యమైన మధ్యాహ్నభోజనం, పౌష్టికాహారం అందజేత.
- 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలకు ప్రతిభ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- 10వ తరగతి విద్యార్థులకు ఎన్‌టీఎస్‌ఎకు ప్రత్యేక శిక్షణ తరగతులు

### టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు


జెండాను ఎగురవేస్తున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్ వద్ద శుక్రవారం టీబీజీకేఎస్ 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు జెండాను ఎగురవేశారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ కోసం చేపట్టిన ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర ఎనలేనిదన్నారు. సింగరేణిలో టీబీజీకేఎస్ యూనియన్ మూలంగానే కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం దేశంలోని ఏ బొగ్గు కంపెనీలో లేని విధంగా సింగరేణి కార్మికులకు అనేక హక్కులను సీఎం కేసీఆర్ కల్పించారన్నారు. సింగరేణిని అనునిత్యం కాపాడుకుంటూ కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా టీబీజీకేఎస్ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో యూనియన్ చర్చల ప్రతినిధి మంగీలాల్, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు సదాశివ్, సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, నాయకులు మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, నాయకులు సాంబగౌడ్ పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరాహార దీక్ష


నిరాహార దీక్ష చేస్తున్న శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, బోనస్‌లు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలో అసిస్టెంట్ లేబర్ కమీషనర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ పవర్‌ప్లాంట్ పవర్‌పర్చేజ్ అగ్రిమెంటు ముగిసిన తర్వాత తమకు నాలుగు నెలల వేతనాలు, మూడేళ్ల బోనస్‌లు కంపెనీ యాజమాన్యం ఇవ్వడం లేదన్నారు. తమకు రావాల్సిన బకాయిలు ఇవ్వాలని రెండు నెలలుగా కంపెనీ యజమాన్యానికి వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వారికి బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, తులా మధుసూదన్, బీఎంఎస్ సంఘం నాయకులు రాజు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జైపాల్‌సింగ్, దేవిసత్యం, సీఐటీయూ నాయకులు సంకేరవి, ప్రకాష్, బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు కాదాసి రవీందర్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మాజీ అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్, చెట్టి శ్రీనివాస్, కార్మిక సంఘం ఉపాధ్యక్షులు సగ్గుర్తి ఆనందరావు, కార్యదర్శి సత్యం, నాయకులు శ్రీనివాస్, బుచ్చయ్య, ఇసారపు శంకర్ పాల్గొన్నారు.

## 63 రోజుల ముందే లక్ష్యం పూర్తి


వివరాలు వెల్లడిస్తున్న ఏజెంట్, మేనేజర్లు


శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 6 గని వార్షిక ఉత్పత్తి లక్ష్యం నూరు శాతం ముందే సాధించింది. గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ తిరుపతి శుక్రవారం గనిపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 1.8 లక్షల టన్నులు కాగా దీనిని మార్చి 31, 2023 నాటికి సాధించాల్సి ఉండగా 63 రోజులు ముందుగానే సాధించినట్లు తెలిపారు. కంపెనీలోని 24 భూగర్భ గనుల్లో కంటే ముందే వార్షిక లక్ష్యం సాధించిన గనిగా రికార్డు నెలకొల్పామన్నారు. ఇది సమష్టి కృషితోనే సాధ్యమైందని వివరించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించడం జరిగిందన్నారు. వచ్చే 2023–24 ఆర్థిక సంవత్సరానికి 1.8 లక్షల టన్నులుగా ఉందన్నారు. గనిలో ప్రస్తుతం 1100 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. 1.02 ఓఎంఎస్ నమోదైందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని సేఫ్టీ అధికారి కాదాసు శ్రీనివాస్, ఇంజినీర్ మహేశ్ పాల్గొన్నారు.



### మండలంలో శిక్షణ కలెక్టర్ గౌతమి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో పంచాయతీ రాజ్, మండల పరిషత్‌లపై పూర్తిస్థాయి అవగాహన కోసం శిక్షణ కలెక్టర్ గౌతమి శుక్రవారం నుంచి నెలరోజుల పాటు పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టనున్నారు. కలెక్టర్ భారతీ హోళ్లికేరీ ఆదేశాల మేరకు జిల్లాలో హాజీపూర్ మండలం శిక్షణ కలెక్టర్ గౌతమి నెల రోజుల పాటు శిక్షణకు నియమించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలోని పంచాయతీల్లో సర్పంచ్, కార్యదర్శుల విధులు, పంచాయతీల్లో చేపట్టే ప్రభుత్వ పథకాలతో పాటు నర్సరీలు, శ్మశాన వాటికలు, డంపేయార్డులు, క్రీడాప్రాంగణాలు తదితర అంశాలను పర్యవేక్షించడం, క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహనకు రానున్నారు. ఎంపీపీ విధులతో పాటు మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకోనున్నారు. ఈ క్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాసరెడ్డిలు శిక్షణ కలెక్టర్ గౌతమికి పంచాయతీరాజ్ వ్యవస్థలోని ప్రధాన అంశాలను వివరించారు. నెల రోజుల పాటు మండలంలోని గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి మరింత అవగాహన పెంచుకోనున్నారు.

### ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం


మంటలు ఆర్పివేస్తున్న రైతులు

భీమిని: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు ఇందూరి మహేష్ తన చేనులో పండిన సుమారు 250క్వింటాళ్ల పత్తికి ధర లేకపోవడంతో ఇంటి వద్ద ఉంచుకున్నాడు. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా సుమారు 15క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. దీంతో రూ.లక్షా 50వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. సంఘటనా స్థలాన్ని కన్నెపల్లి ఎస్సై సురేష్ పరిశీలించి షార్ట్ సర్క్యూటా? ఎవరైనా నిప్పంటించా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

### కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్ల సమస్యలు తీర్చాలి


కలెక్టర్ కార్యాలయంలో ఏవో సురేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

పాతమంచిర్యాల: కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏవో సురేష్‌కువినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తోకల తిరుపతి మాట్లాడారు. కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల వేతనాలు రూ.26000 లకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, కేర్ టేకర్‌లను నియమించాలని, ఏఎన్ఎంలకు రోస్టర్ పద్ధతిలో నైట్ డ్యూటీలు వేయాలని, కొత్తగా నియమితులైన అకౌంటెంట్‌లకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. పాఠశాల నుంచి కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన కేజీబీవీ పాఠశాలలకు అదనపు సిబ్బంది కేటాయించాలన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి, సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు శ్రీలత, మౌనిక, అరుణ, పద్మ, తిరుమల, లక్ష్మీ, శారద తదితరులు పాల్గొన్నారు.

### ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా ధాబా

- జెడ్పీ సీఈవో రత్నమాల


రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో రత్నమాల

వాంకిడి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ధాబా గ్రామాన్ని ఉమెన్ ఫ్రెండ్లీ (మహిళా స్నేహ పూర్వక) గ్రామ పంచాయతీగా ఎంపిక చేసినట్లు జెడ్పీ సీఈవో రత్నమాల తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ధాబా గ్రామపంచాయతీని ఆమె సందర్శించి మాట్లాడారు. మహిళా స్నేహ పూర్వక పంచాయతీగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మహిళా సాధికారతకు సంబంధిత ప్రణాళికను గ్రామ సభ ద్వారా గ్రామస్తుల సమక్షంలో తయారు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని మహిళలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో శివకుమార్, ధాబా కార్యదర్శి ఉన్నారు.

### ఎస్జీటీలకు అవకాశం కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: స్పౌజ్ బదిలీలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. స్పౌజ్ బదిలీల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. జిల్లాలో కేవలం 27 మంది ఎస్జీటీ స్పౌజ్ కోటాలో దరఖాస్తు చేసుకుంటే తగినన్ని ఖాళీలు ఉన్నప్పటికీ కూడా జిల్లాలోకి అనుమతించకపోవటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు సొంత జిల్లాకు వచ్చేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. బదిలీల షెడ్యూల్ పూర్తిగా ప్రారంభం కాకముందే దొడ్డిదారిన ఇస్తు కౌన్సెలింగ్ విధానాన్ని అపహస్యం చేయటాన్ని తప్పుబట్టారు. ఈపైరవీ బదిలీలను నిలిపివేయాలన్నారు. స్పౌజ్ ఉపాధ్యాయులకు గతంలో బ్లాక్ చేసిన 12 జిల్లాల్లోకి కొంత మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వటంపై పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు.

## మంత్రాల నెపంతో వ్యక్తిపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న సత్తార్

రామకృష్ణాపూర్: మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో ఒకరిపై ఐదుగురు వ్యక్తులు హత్యాయత్నానికి పాలపడ్డారు. గురువారం అర్ధరాత్రి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మందమర్రి సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ... కాగజ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సత్తార్ కొంతకాలంగా స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలోని దర్గా నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మంత్రాలు చేస్తూ అదే ప్రాంతానికి చెందిన పలువురు అనారోగ్యానికి కారణమవుతున్నాడని, అలాగే కొంతమంది మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని పట్టణానికి చెందిన బుడిగె వంశీ, ప్రకాష్, రవి, సాయి అనే నలుగురితో పాటు దర్గాకు ఆనుకునే ఉన్న స్థలం విషయంలో గతంలో సత్తార్‌తో గొడవపడిన బీజేపీ నాయకుడు పాలరాజయ్య కలిసి దర్గాలో నిద్రిస్తున్న సత్తార్‌పై ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలైన సత్తార్‌ను కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఐదుగురిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

- సుమారు రూ.లక్షా 85వేల విలువైన బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాగజ్‌నగర్ డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న కాగజ్‌నగర్ డీఎస్పీ

సిర్పూర్(టి): జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న యువకుడిని పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. సిర్పూర్(టి) జీపీ శివాపూర్ గ్రామానికి చెందిన దోని గోపి కొంత కాలంగా సిర్పూర్(టి)లోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇటీవల పట్టణంలోని సత్యనారాయణ ఇంట్లో 24.5 గ్రాముల నెక్‌లెస్, చెవి కమ్మలు, ముక్కు పుడక అపహరించగా, కొతూతరి బుజ్జి ఇంట్లో 12 తులాల బంగారం దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. అలాగే దొంగిలించిన సుమారు రూ.లక్షా 85వేల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న కౌటాల సీఐ బుద్ధేస్వామి, సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేష్‌లను అభినందించారు.

## అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నోడల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భానుమతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుంచి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో నోడల్ అధికారి హేమసత్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, చట్ట బద్ధత సౌకర్యాలు లేక చాలా నష్టపోతున్నారన్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రాజమణి, అంగన్‌వాడీ వర్కర్‌లు శంకరమ్మ, అనురాధ, రాజేశ్వరి, మహేశ్వరీ, వెరోనిక, చంద్రకళ, పద్మావతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అబ్బోజు రమణ, ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, పాల్గొన్నారు.

## హెచ్‌ఎం, ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కాసిపేట: దేవాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆశ్రమ పాఠశాల ఎదుట శుక్రవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్నారంలో పట్టుబడిన బియ్యం దేవాపూర్ ఆశ్రమ పాఠశాలకు చెందినవి అయినప్పటికీ ఏటీడీఓ, డీటీడీఓలు విచారణ పేరుతో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో 21.80 క్వింటాళ్లు ఉండాల్సి ఉండగా కేవలం 11క్వింటాళ్ల బియ్యం మాత్రమే ఉన్నాయన్నారు. వెంటనే హెచ్‌ఎంతో పాటు ఏటీడీఓ, డీటీడీఓను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీవోకు ఫోన్‌లో మాట్లాడగా సస్పెండ్ చేయనున్నట్లు తెలుపడంతో ధర్నా విరమించారు. తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి జంగు, జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఉన్నారు.